

అప్రమత్తతే జీవాలకు రక్ష

వర్షాకాలం... వ్యాధులు ప్రబలేకాలం... ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలకు వ్యాధులు సోకక ముందే పశుపోషకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి 8లో▶



బాసరలో 'మహా' రద్దీ

బాసర క్షేత్రానికి సోమవారం పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. 1,650 అక్షరాభ్యాస పూజలు నిర్వహించారు. రూ.18.70 లక్షల ఆదాయం వచ్చింది. 8లో▶

గరిష్టం/కనిష్టం
36.6 /27.3

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రుతుపవనాలు, ద్రోణి ప్రభావంతో చాలా ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

జాడలేని చినుకు!



కుంటాల మండలం ఓలాలో పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు

- రుతుపవనాలు వచ్చి వారం దాటినా కురవని వానలు
- విత్తనాలు వేసుకునేందుకు సిద్ధంగా ఉన్న రైతులు
- వరుణుడి కరుణ కోసం ఆకాశం వైపు అన్నదాత చూపు

లక్ష్మణచాంద/భైంసా: వ్యవసాయ ఆధారిత జిల్లా నిర్మల్. 80 శాతం ప్రజలు వ్యవసాయంపైనే ఆధార పడి జీవనం సాగిస్తున్నారు. వానాకాలం సాగు కోసం ఇప్పటికే రైతులు విత్తనాలు వేసేందుకు భూములను సిద్ధం చేసుకున్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి పెట్టుకున్నారు. రుతుపవనాలు కూడా ఈసారి ముందుగానే రాష్ట్రంలో ప్రవేశించడంతో వర్షాలు కూడా ముందస్తుగానే కురుస్తాయని భావించారు. కానీ 13 రోజులు గడిచినా చినుకు జాడలేదు. అక్కడక్కడా జల్లులు మినహా.. భూమి చల్లబడేలా వాన కురవలేదు. దీంతో రైతులు వరుణుడి కరుణ కోసం ఆకాశంవైపు ఆశగా ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో సాగు ఇలా....

జిల్లాలో ఈ వానాకాలంలో పత్తి 1.68 లక్షల ఎకరాల్లో, వరి 1.35 లక్షల ఎకరాల్లో, సోయా 1.01 లక్షల ఎకరాల్లో, మొక్కజొన్న 18 వేల ఎకరాల్లో, కంది 10 వేల ఎకరాల్లో, ఇరత పంటలు 1000 ఎకరాల్లో సాగు చేస్తారని వ్యవసాయధికారులు అంచనా వేశారు. మొత్తం 4.33 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని జిల్లా వ్యవసాధికారి అంజిప్రసాద్ తెలిపారు.

విత్తనాలు వేసిన 20 శాతం మంది..

ఇదిలా ఉంటే.. అడపాదడపా కురుస్తున్న జల్లులకు, బోర్లు, బావులు ఉన్న రైతులు 20 శాతం మంది రైతులు పత్తి, మొక్కజొన్న విత్తనాలు వేసుకున్నారు.



వాన కోసం ఆకాశంవైపు చూస్తున్న రైతు

అయితే వర్షాలు వరుసగా కురవకపోతే.. వేసిన విత్తనాలు కూడా మొలకెత్తవని, ఎండలు కొడితే మొలకలు కూడా మాడిపోతాయని ఆందోళన చెందుతున్నారు. మూడేళ్లుగా జిల్లా రైతులు జూన్ మొదటి వారంలోనే పత్తి విత్తుకుంటున్నారు. ఇలా వేయడం రైతులకు కలిసి వస్తోంది. ఈయేడు కూడా అలాగే విత్తుకోవాలని భావించిన వర్షాలు లేక వెనుకడుగు వేశారు.

జిల్లాలో వర్షపాతం ఇలా....

జిల్లాలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 53.1 మి.మీలు నమోదు కావాల్సి ఉండగా కేవలం 11 మి.మీలు మాత్రమే కురిసింది. చాలా తక్కువ వర్షపాతం నమోదైనందున రైతులు విత్తనాలు వేసుకోవద్దని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. సగటు వర్షపాతం 50 మి.మీలు దాటిన తర్వాతే విత్తనాలు వేసుకోవాలని పేర్కొన్నారు. వారం రోజులుగా జిల్లాలో వాతావరణ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. విస్తారంగా వర్షాలు కురుస్తాయన్న సూచనలు కనిపిస్తున్నాయి. కానీ ఉరుములు మెరుపులతో జల్లులు మాత్రమే అక్కడక్కడా కురుస్తున్నాయి. ఒక్క భారీ వర్షం కురిస్తే వ్యవసాయ పనులు ఊపందుకునే అవకాశం ఉంటుంది.

వర్షాల కోసం పూజలు..

జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో వర్షాల కోసం పూజలు ప్రారంభమయ్యాయి. గ్రామ దేవతలకు పూజలు చేస్తున్నారు. ఆరెల్లి మైసమ్మ, గట్టు మైసమ్మ, ఊరడవ్వ, ముత్యాలమ్మ, లక్ష్మీదేవి ఆలయాల్లో పూజలు చేస్తున్నారు. ఆదివారం చాలాచోట్ల కుల సంఘాలు, యువకులు, గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో బోనాలు తీసి జంతువులను బలి ఇచ్చారు. వరుణుడు కరుణించేలా చూడాలని వేడుకున్నారు.

ఆందోళన చెందొద్దు

జిల్లాలో ఈ వానాకాలం సీజన్ ప్రారంభమై 15 రోజులు గడిచింది. ఇప్పటి వరకు మోస్తరు వాన కూడా కురవలేదు. అయినా అన్నదాతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సోయా పంటను జూలై 20 వరకు విత్తుకోవచ్చు. మొక్కజొన్న నీరు ఎప్పుడు ఉంటే అప్పుడు వేసుకోవచ్చు. జిల్లాలో సగటు వర్షపాతం 50 మి.మీలు నమోదయ్యే వరకూ విత్తనాలు వేసుకోవద్దు.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి



భైంసా మండలం దేగాంలో డ్రిప్ పద్ధతిలో సాగుచేస్తున్న పత్తిపంట



విత్తనాలు వేసేందుకు సిద్ధంగా ఉన్న సాగు భూమి



రాచాపూర్ సమీపంలో విత్తనాలు వేసిన చేనుకు నీరందిస్తున్న రైతు

ఘనంగా బక్రీద్



నమాజ్ చేస్తున్న ముస్లింలు



నిర్మల్‌టౌన్: త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్(ఈద్‌-ఉల్‌-జుహా) పండుగను జిల్లాలో ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే ఈద్గాల వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పండుగ విశిష్టతను ముస్లిం మత పెద్దలు తెలియజేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మిత్రులు, బంధువులు, పేదలకు కుర్బానీ అందించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా మసీదుల వద్ద ఎస్పీ జానకీషర్మిల ఆదేశాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



స్థలం సరిపోక రోడ్లపై నమాజ్ చేస్తున్న ముస్లింలు



నిర్మల్ ఈద్గా మైదానంలో నమాజ్ చేస్తున్న ముస్లింలు

న్యూస్‌రీల్

పాపహరేశ్వరాలయంలో జిల్లా జడ్జి పూజలు



జడ్జికి తీర్థప్రసాదాలు అందిస్తున్న పూజారులు

దిలావర్‌పూర్: మండలంలోని ప్రాచీన ప్రాశస్త్యం గల శ్రీమాతాన్నపూర్ణ పాపహరేశ్వరాయాన్ని జిల్లా జడ్జి జోగినిపల్లి భవిష్య సోమవారం సందర్శించారు. జడ్జికి ఆలయ మర్యాదల ప్రకారం పూర్ణకుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. తర్వాత అన్నపూర్ణేశ్వరీదేవీ చెంత ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు జడ్జిని సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. జడ్జి వెంట ఆలయ కమిటీ చైర్మన్ నార్వాడి వెంకట్రావు ఉన్నారు.

టమాటా @ రూ.వంద



భైంసాటౌన్: మార్కెట్‌లో కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోయాయి. మొన్నటి వరకు కిలో టమాటా రూ.20 నుంచి రూ.40 వరకు ఉండగా, సోమవారం రూ.వంద పలికింది. ఇక, వంకాయ, బెండకాయ, గోబి, బీరకాయ, మిర్చి, కొత్తిమీర ఇలా.. ఏది కొన్నా పిరమే ఉంటున్నాయి. భైంసాలో ప్రతీ సోమవారం వారసంత ఉంటుంది. పట్టణ ప్రజలే కాకుండా చుట్టు పక్కల గ్రామాల ప్రజలు సైతం వారం రోజులకు సరిపడా కూరగాయలు కొనుగోలు చేస్తుంటారు. మొన్నటి వరకు రూ.వందకు నాలుగైదు రకాల కూరగాయలు వచ్చేవని, ఇప్పుడు టమాటా కిలోకే రూ.వంద వెచ్చించాల్సి వస్తోందంటున్నారు. కూరగాయల దిగుబడి లేకపోవడంతోనే ధరలు అమాంతం పెరిగిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు. భైంసా మార్కెట్‌లో సోమవారం వంకాయ కిలో రూ.50, గోబి రూ.వంద, మిర్చి రూ.120, బెండకాయ రూ.50, కొత్తిమీర కట్ట రూ.70 వరకు విక్రయించారు.

పల్లె వైద్యం.. మరింత మెరుగు



బాసర మండలం బిద్రెల్లిలో ఎన్‌సీడీ ప్రోగ్రాంలో భాగంగా పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

- ఆస్పత్రుల్లో కొత్తగా 7 రకాల సేవలు
- మొదటి విడతగా 36 కేంద్రాలు ఎంపిక
- ఈమేరకు వైద్య సిబ్బందికి శిక్షణ

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య, ఉప కేంద్రాలలో ఇప్పటికే అందిస్తున్న 5 రకాల వైద్య సేవలతోపాటు కొత్తగా మరో 7 రకాల సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు వైద్య ఆరోగ్యశాఖ చర్యలు చేపడుతోంది. ఈ దిశగా వైద్యాధికారులకు శిక్షణ ఇచ్చారు. మానసిక సమస్యలు, చెవి, ముక్కు, గొంతు, కళ్లు, దంత చికిత్సలు అందుబాటులోకి వస్తే ప్రజలకు వచ్చే రుగ్మతలన్నింటికీ స్థానికంగానే చికిత్స అందించినట్లు అవుతుంది.

పెద్దాస్పత్రులకు వెళ్లకుండా..

క్షేత్రస్థాయిలో వైద్యరంగాన్ని బలోపేతం చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆరోగ్య కేంద్రాలు, పట్టణాలకు సుదూరంగా ఉండే పల్లె దవాఖానాల్లో మరిన్ని సేవలు అందుబాటులోకి తెస్తోంది. ప్రధానంగా పల్లె ప్రజలకు సమీపంలోనే వైద్యం అందించాలని, తద్వారా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే బాధ తప్పించాలని ప్రభుత్వ భావనగా చెబుతున్నారు. ఇప్పటికే డయాగ్నోస్టిక్ హబ్ ద్వారా వివిధ రకాల పరీక్షలు చేస్తున్నారు. పీహెచ్‌సీ స్థాయిలో శాంపిళ్లను సేకరించి జిల్లా కేంద్రంలోని టిహబ్‌కు పంపించి 24 గంటల్లో వారి సెల్‌ఫోన్‌కు రిపోర్టు పంపిస్తున్నారు. దీంతో మెడికల్ ఆఫీసర్ పరిశీలించి వైద్యం అందించే వీలు కలుగుతోంది. ప్రస్తుతం మరిన్ని వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొస్తే ప్రజలు వ్యయప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి వెళ్లే ఇక్కట్లు తప్పనున్నాయి.



గుండంపల్లిలో రోగులకు పరీక్షలు..

అదనపు సేవలకు ఎంపికైన ఆసుపత్రులు...

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు: బాసర, కుంటాల, లక్ష్మణచందా, లోకేశ్వరం, మాహగావ్, మామడ, ముజ్గి, సారంగాపూర్, సోన్, వెల్మల్ బొప్పారం, కడెం, దిలావర్పూర్, తానూర్

పట్టణ ఆరోగ్య కేంద్రాలు: రాంనగర్, బంగల్‌పేట్, భైంసా

బస్తీ దవాఖానాలు: పెంబి, బంగల్‌పేట్, భైంసా

ఆరోగ్య ఉప కేంద్రాలు: చించోలి(బి), తరోడ, బోరిగం, మల్లాపూర్, లింబా(కె), దేహెగాం, నయాఆబాడీ, ముధోల్, పార్డీబి, సిరిపెల్లి, గడ్‌చందా, కుస్లి, పరిమండల్, మాసాయిపేట, గంగాపూర్, మాలేగాం

ఐదు నుంచి 12కు..

జిల్లాలో ఎంపిక చేసిన 36 కేంద్రాల్లో 12 రకాల వైద్య సేవలు అందించనున్నారు. ప్రస్తుతం ఆయా కేంద్రాల్లో మాతాశిశు సంరక్షణ, వ్యాక్సినేషన్, కుటుంబ నియంత్రణ, అంటువ్యాధుల నియంత్రణ, సాధారణ వ్యాధులకు చికిత్స అందుతోంది. వీటికి తోడు ఈఎన్‌టీ, ఆప్తాల్మిక్, డెంటల్, మానసిక, పాలియేటివ్ కేర్, 65 ఏళ్లు దాటిన వారికి ఎల్డర్లీ హెల్త్ కేర్, ఎన్సీడీ సేవలు కొత్తగా అందించనున్నారు. తొలి విడత 36 కేంద్రాలను ఎంపిక చేసినప్పటికీ క్రమంగా అన్ని ఆరోగ్య కేంద్రాలకు విస్తరించనున్నారు.

36 కేంద్రాల్లో అదనపు సేవలు..

జిల్లా జనరల్ ఆసుపత్రితోపాటు భైంసా ఏరియా ఆస్పత్రి, ఒక సామాజిక ఆరోగ్య కేంద్రం, 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 110 ఆరోగ్య ఉప కేంద్రాలు, ఉండగా ఇందులో 59 సబ్ సెంటర్లను పల్లె దావాఖానాలుగా మార్చి వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఆరోగ్య కేంద్రాల్లో మూడొంతు మాతా, శిశు సంరక్షణ టీకాలు, కుటుంబ నియంత్రణ, అంటువ్యాధుల నియంత్రణ, సాధారణ వ్యాధులకు చికిత్సలు అందజేస్తున్నాయి. జాతీయ అసంక్రమిక వ్యాధుల ప్రాజెక్టు(నాన్ కమ్యూనికేబుల్ డిసిజెస్ (ఎన్సీడీ) లో భాగంగా ఇక నుంచి జిల్లాలో అదనంగా ప్రత్యేక సేవలు అందిస్తారు. మరికొన్ని రోజుల్లో ఏడు రకాల సేవలు అందుబాటులోకి రానున్నాయి. మొదటి విడతగా 14 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మూడు అర్బన్ ఆరోగ్య కేంద్రాలు మూడు బస్తీ దవాఖానాలతోపాటు మరో 16 ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

శిక్షణ పూర్తి..

పేద ప్రజలకు అదనపు వైద్య సేవల ద్వారా ఎంతో మేలు జరుగుతుంది. ప్రస్తుతం 30 ఏళ్లు దాటిన యువతకు బీపీ, షుగర్ వంటి పరీక్షలు ఇంటి వద్దకే వెళ్లి చేస్తున్నాం. ఈ సేవలు అందించేందుకు అవసరమైన ఎక్విపెమెంట్ కోసం ప్రతిపాదనలు పంపించాం. గతంలోని 5 రకాల సేవలతోపాటు కొత్తగా 7 రకాల సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం వైద్య సిబ్బందికి తగిన శిక్షణను అందించాం. గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ శ్రీనివాస్, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి

బెటాలియన్ కమాండెంట్‌గా నిఖిత పంత్

- పీజేపీసీ చటర్జీ బదిలీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడ టీజీఎస్పీ రెండో బెటాలియన్ కమాండెంట్ పీజేపీసీ చటర్జీ బదిలీ అయ్యారు. డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈయన స్థానంలో 2017 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన నిఖిత పంత్‌ను నియమించినట్లుగా ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఈమె ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా సతీమణి.

ఆయిల్‌పాం సాగు పెంచాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

కడెం: రైతులకు లాభదాయకమైన ఆయిల్‌పాం పంట సాగును పెంచాలని తెలంగాణ ఆయిల్‌పాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సూచించారు. కమిటీ మెంబర్‌గా నియమితులైన వెడ్మ బొజ్జును ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ క్లస్టర్ అధికారి మౌనిక, ప్రియూనిక్ కంపెనీ మేనేజర్ వానోజ్‌రెడ్డి, దినేశ్ ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో సోమవారం కలిశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు అడ్వయిజరీ కమిటీ మెంబర్‌గా నియామక పత్రం అందజేశారు. అనంతరం మండలంలోని దోస్త్‌నగర్ గ్రామంలో బియ్యాల సురేశ్ వ్యవసాయ క్షేత్రాన్ని ఉద్యాన అధికారి మౌనిక సందర్శించారు. మామిడి అంటు మొక్కలను పరిశీలించారు. పండ్ల మొక్కల ఎంపికలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మొక్కలు నాటే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.



ఎమ్మెల్యే బొజ్జుకు నియామక పత్రం అందజేస్తున్న ఉద్యాన అధికారి మౌనిక

ప్రమోషన్ ఆర్డర్లకు నిరీక్షణ

నిర్మల్ రూరల్: ప్రమోషన్ ఆర్డర్ల కోసం ఉపాధ్యాయులకు నిరీక్షణ తప్పడం లేదు. ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ కోసం రెండు రోజుల క్రితం వెబ్ ఆప్షన్ ఇచ్చారు. సోమవారం ఆర్డర్లు రిలీజ్ కావాల్సి ఉండగా, రాత్రి వరకు రాలేదు. రాత్రి 9 గంటల సమయంలో రాష్ట్ర విద్యాశాఖ అధికారులు అన్ని జిల్లా అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. కొన్ని జిల్లాల్లో ఉపాధ్యాయుల వివరాలు తప్పుగా నమోదు కావడంతో అవిసరి చేస్తున్నారని తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి అర్ధరాత్రి వరకు డీఈవోలకు మెయిల్ ద్వారా పంపిస్తారని సమాచారం. ఆ తర్వాత డీఈవో కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారులు మరోసారి క్రాస్‌చెక్ చేసుకుని ఆర్డర్లను విడుదల చేసే అవకాశం ఉంది. ప్రమోషన్ పొందినవారు మంగళవారం తమ పాత పాఠశాల నుంచి రిలీవ్ అయి, కొత్త పాఠశాలలో జాయిన్ కావాల్సి ఉంటుంది.



ఉపాధ్యాయుల వివరాలు చూస్తున్న జిల్లా అధికారులు

ఆర్టీసీ భైంసా డీఎంపై సస్పెన్షన్ వేటు?

భైంసాటౌన్: ఆర్టీసీ భైంసా డిపో మేనేజర్ అమృతపై సస్పెన్షన్ వేటు పడినట్లు తెలిసింది. కిందిస్థాయి సిబ్బంది, రిటైర్డ్ ఉద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేయడం, బస్టాండ్లలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి అవకతవకలకు పాల్పడినట్లు రావడంతో డీఎంను విధుల నుంచి తప్పించినట్లు సమాచారం. ఆరోపణల నేపథ్యంలో రెండునెలలుగా అమృత సెలవులో ఉన్నారు. అప్పటి నుంచి నిర్మల్ డీఎం భైంసా ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. అమృతపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసిన అధికారులు అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేసినట్లు తెలిసింది. ఆదిలాబాద్ రీజియన్ కార్యాలయానికి పిలిపించుకుని సస్పెన్షన్ ఆర్డర్ ఇచ్చినట్లు సమాచారం.

మొదటి నుంచి వివాదాస్పదమే..

ఇదిలా ఉండగా భైంసా డీఎం తీరు మొదటి నుంచి వివాదాసపదమే అన్న ఆరోపణలు ఉన్నాయి. కిందిస్థాయి ఉద్యోగులను వేధించేవారని, తనకు అనుకూలంగా ఉన్న కొందరితో సఖ్యతగా ఉండేవారన్న ఆరోపణలు ఉన్నాయి. నమస్తే పెట్టకపోయినా వేధించేవారని ఉద్యోగులు తెలిపారు. పేద విద్యార్థులకు బస్‌పాస్‌ల పేరిట దాతల నుంచి సేకరించిన డబ్బులను దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనారోగ్య కారణాలతో సులువైన విధులే వేయాలని ఉద్యోగులు కోరితే వారి నుంచి డబ్బులు వసూలు చేసేవారన్న విమర్శలు ఉన్నాయి. ముధోల్, బాసర బస్టాండ్ల అభివృద్ధి పనుల్లోనూ అక్రమాలకు పాల్పడ్డారని తెలిసింది.

క్లుప్తంగా

108లో ప్రసవం



బిడ్డను అందిస్తున్న ఈఎంటీ నవీన్

ఇంద్రవెల్లి: సిరికొండ మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన పులవతికి సోమవారం తెల్లవారుజమున పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. వెంటనే గ్రామానికి చేరుకున్న సిబ్బంది మహిళను ఇంద్రవెల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటినొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ నవీన్ ప్రసవం చేయడంతో ఆడబిడ్డకు జన్మనిచ్చిందని ఈఎంటీ నవీన్, పైలెట్ ఆత్రం అశోక్ తెలిపారు. అనంతరం తల్లీబిడ్డను ఇంద్రవెల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వారు పేర్కొన్నారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

నిర్మల్‌టౌన్: విద్యుత్‌షాక్‌తో ఒకరు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గొల్లపేట్ కాలనీకి చెందిన ప్రమోద్ (31) వృత్తి రీత్యా ఓ హోటల్లో పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం ఇంటి బయట ఉండగా ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న హైటెన్షన్ వైర్లు తగిలి షాక్‌కు గురయ్యాడు. గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించి న వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



మృతి చెందిన గేదె

సారంగపూర్: మండలంలోని వంజర్‌లో గాండ్ల చిన్న ముత్యంకు చెందిన గేదె విద్యుదాఘాతంతో మృతి చెందింది. సోమవారం ఉదయం సత్యసాయినగర్ సమీపంలోని పంట పొలాల్లో మేత మేస్తుండగా విద్యుత్ స్తంభానికి అమర్చిన సపోర్టు వైరుకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే గేదె మృతి చెందిందని బాధిత రైతు ఆరోపించాడు. తనకు జరిగిన నష్టానికి విద్యుత్ శాఖ అధికారులే బాధ్యత వహించాలన్నాడు. గేదె విలువ రూ.75 వేల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

ఉట్నూర్‌రూరల్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై మనోహర్ తెలిపిన వివరాల మేరకు ఉట్నూర్ మండలం సాకెర–బీ గ్రామానికి చెందిన తొడసం ఇస్రు, జంగుబాయి దంపతుల పెద్ద కుమారుడు తొడసం అర్జున్ (24) డిగ్రీ పూర్తిచేసి వ్యవసాయంలో తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. ఆదివారం ఉదయం పొలం పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం అయినా ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. సాయంత్రం అటుగా వెళ్తున్న వ్యక్తికి పంటచేనులో చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. సోమవారం మృతుని తండ్రి ఇస్రు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్రమత్తతే జీవాలకు రక్ష

- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు
- వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు అవసరం
- నిర్లక్ష్యంగా ఉంటే మొదటికే ప్రమాదం



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది (ఫైల్)

బెల్లంపల్లిరూరల్/నిర్మల్‌చైన్‌గేట్: వర్షాకాలం... వ్యాధులు ప్రబలేకాలం... ముఖ్యంగా జీవాలు సీజనల్ వ్యాధుల బారిన పడేకాలం ఇది. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు వ్యాధులకు గురికాకముందే పశుపోషకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతైనా అవసరం. వర్షాకాలం ప్రారంభంలో మూగజీవాలు గొంతువాపు, జబ్బవాపు, చిటికె రోగం, గాలికుంటు లాంటి వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో మూగజీవాలకు వచ్చే వ్యాధులు, నివారణ పద్ధతులపై పెంపకందారులకు పశుసంవర్ధకశాఖ అధికారుల సలహాలు, సూచనలు..

జబ్బవాపు :

జబ్బవాపు వ్యాధిని బ్లాక్ క్వార్టర్, బ్లాక్ లెగ్ అని కూడా అంటారు. ఇది తెల్లజాతి పశువుల్లో ఎక్కువగా సంక్రమిస్తుంది. క్లాస్ట్రిడియం చౌవోయి బ్యాక్టీరియా వలన వ్యాధి వ్యాప్తి చెందుతుంది.

వ్యాధి సంక్రమణ, లక్షణాలు...

కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం ద్వారా, గాయాల వలన ఈ వ్యాధి పశువులకు సోకుతుంది. తీవ్రమైన జ్వరం ఉండి ఆహారం తీసుకోకపోవడం, కుంటడం, ఆకస్మికంగా భుజం, తొడ భాగాల్లో వాపు కనిపిస్తుంది. కండరాల ప్రాంతంలో బ్యాక్టీరియా విష పదార్థాన్ని విడుదల చేయడం ద్వారా ఆ ప్రాంతంలో చర్మం కుళ్లిపోతుంది. కొన్ని దూడల్లో ఈ లక్షణాలు కనిపించకుండానే కిందపడి కొట్టుకుని కొన్ని గంటల వ్యవధిలోనే మృత్యువాత పడుతాయి.

చికిత్స, నివారణ చర్యలు

వ్యాధి సోకిన పశువులకు పెనిఫల్లిన్స్ ఎఫ్‌పీపీ 40ఎంఎల్ ఐవీ, చిన్న దూడలకు 20ఎంఎల్ ఐవీ ఇవ్వాలి. ఆంటీఇన్‌ఫ్లమటరీ, ఎన్‌ఎస్‌ఏఐడీఎస్, బీకాంప్లెక్స్ ఇంజక్షన్ వేయాలి.

చిటికె రోగం :

దీనినే పల్స్ కిడ్నీ డిసిస్ అంటారు. అధికంగా ఆహారం తినడం వలన ఈ వ్యాధి సోకుతుంది. క్లాస్ట్రిడియం పర్‌ఫ్రంజెన్స్ బ్యాక్టీరియా టైప్ సీ, డీ అనే స్ట్రెయిన్స్ వలన గొర్రెలు, మేకలకు వ్యాధి సోకుతుంది.

వ్యాధి సంక్రమణ, లక్షణాలు

మట్టి కలిసిన గడ్డిని తినడం, వర్షాలు కురిసిన సమయంలో అధిక మోతాదులో గడ్డిని మేయడంతో నట్టలు ఎక్కువగా తయారవుతాయి. దీంతో బ్యాక్టీరియా అధికంగా వృద్ధి చెంది ఎప్సిలాన్ ట్యాక్సిన్‌ని పొట్టలో విడుదల చేయడంతో విరేచనాలు అవుతాయి. ఇవి ట్యాక్సిన్ బ్రెయిన్‌కు చేరి ఫిట్స్ వస్తుంది. బ్రెయిన్‌కి చేరిన సమయంలో పశువులు గాలిలో ఎగిరి చిటికె వేసే సమయంలో చనిపోతాయి. టైప్–డీ కిడ్నీలో చేరడంతో కిడ్నీలు గుజ్జువలే తయారవుతాయి. వ్యాధి సోకిన జీవాల్లో విరేచనాలు, కడుపుబ్బరం, వణుకు, పళ్లు కొరకడం, జ్వరం, ఫిట్స్ వచ్చినట్లు కొట్టుకోవడం చేస్తాయి.

చికిత్స, నివారణ చర్యలు

వ్యాధి సోకిన జీవాలకు ఆంపిసిల్లిన్, క్లోరాంఫినికాల్ మందులు వేయాలి. రిహైడ్రోషన్ సొల్యూషన్, సపోర్టివ్ థెరపీ అందించాలి. ముందస్తు టీకాలు వేయించాలి.

గొంతువాపు :

దీనినే పాశ్చురెల్లోసిస్ అని కూడా అంటారు. ఇది ముఖ్యంగా పశువుల్లో, ప్రధానంగా గేదెల్లో వ్యాపిస్తుంది. పాశ్చురెల్లా మల్టోసిడా బ్యాక్టీరియా వలన ఈ వ్యాధి సోకుతుంది. ఈ బ్యాక్టీరియా సాధారణంగా పశువుల గ్రసనిలో ఉంటుంది. వాతావరణం బ్యాక్టీరియాకు అనుకూలంగా మారినప్పుడు ఇది ఎక్కువగా వృద్ధి చెంది వ్యాధి వ్యాపిస్తుంది.

వ్యాధి సంక్రమణ, లక్షణాలు

వ్యాధి సోకిన పశువు చొంగతో తాగునీరు, గడ్డి కలుషితమై ఇతర పశువులకు ఈ వ్యాధి సంక్రమిస్తుంది. వ్యాధి సోకిన పశువుల్లో అధిక జ్వరం, చొంగకారడం, గొంతు, మెడ, ముందరి కాళ్ల మధ్యలో నీరు చేరడం, కంటి నుండి నీరు కావడం, ఊపిరితిత్తులకు చేరి శ్వాస తీసుకోవడం ఇబ్బంది అవుతుంది.

చికిత్స, నివారణ చర్యలు

వ్యాధి సోకిన పశువులకు సల్ఫాడిమిడిన్ యాంటీ బయోటిక్ 150 మిల్లీ గ్రాములను ఇంజక్షన్ రూపంలో డైల్యూట్ చేసి అందించాలి. ఆంటీ ఇన్‌ఫ్లమటరీ నాన్ స్టిరాయిడ్, ఆంటీ ఇన్‌ఫ్లమటరీ డ్రగ్స్ ఇవ్వాలి. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే డెక్సన వంటి స్టిరాయిడ్స్ అందించాలి. సీజన్‌కు ముందే వ్యాక్సినేషన్ వేయించడం ద్వారా వ్యాధి ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టవచ్చు.

గాలి కుంటు వ్యాధి:

ఈ వ్యాధిని ఫుట్, మౌత్ డిసీస్ అంటారు. ఆవులు, గేదెలు, తెల్లజాతి పశువుల్లో ఎక్కువగా వ్యాపిస్తుంది. వ్యాధి సోకిన పశువుల్లో పాల దిగుబడి తగ్గుతుంది. పికోర్ని ఫ్యామిలీకి చెందిన ఆఫ్థస్ వైరస్ వలన ఈ వ్యాధి సోకుతుంది.

వ్యాధి సంక్రమణ, లక్షణాలు

వ్యాధి సోకిన పశువుల్లో అధిక జ్వరం, కాలి పుండ్లు, నోట్లో, చిగుర్లలో బొబ్బలు, పాలిచ్చే వాటిలో పాల దిగుబడి తగ్గుతుంది. వ్యాధి సోకిన పశువుల పాలు తాగిన చిన్న దూడలు చనిపోయే ప్రమాదం ఉంది.

చికిత్స, నివారణ చర్యలు

ఈ వ్యాధి వైరల్ వ్యాధి కావడంతో పూర్తి స్థాయిలో చికిత్స ఉండదు. సెకండరీ ఇన్‌ఫెక్షన్స్ రాకుండా ఆంటీబయోటిక్స్ పెనిసిల్లిన్స్ వాడాలి. నోటి పుండ్లకు బోరోగ్లిసరిన్ పేస్ట్ రాయాలి. కాలి పుండ్లకు పొటాషియం పర్మాంగనేట్‌తో శుభ్రంగా కడిగి ఆంటిసెప్టిక్ ఆయింట్‌మెంట్ రాయాలి. ఎన్‌ఎస్‌ఏఐడీఎస్, ఆంటీ ఇన్‌ఫ్లిమటరీ డ్రగ్స్, లివర్‌టానిక్స్, మల్టీవిటమిన్ టానిక్స్ కచ్చితంగా వాడాలి. ప్రతీ ఆరు నెలలకు ఒకసారి టీకాలు వేయించాలి.

ముందస్తు జాగ్రత్తలు అవసరం



మూగజీవాలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా యజమానులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. పశువుల పాకలు శుభ్రంగా ఉంచుకోవాలి. జీవాలు వ్యాధుల బారిన పడక ముందే ముందస్తు టీకాలు వేయించడంతో పాటు పశు వైద్యాధికారుల సలహాలు, సూచనలు పాటించాలి.

– మాను సుజాత, పశువైద్యాధికారి, ఆకెనపల్లి, బెల్లంపల్లి మండలం

గిరిజనుల సమస్యలపై పోరాడుతాం

ఆదిలాబాద్‌టౌన్: ఆదివాసీ గిరిజనుల సమస్యలపై పోరాడుతామని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రణదివేనగర్‌లో ఆదివాసీ హక్కుల నాయకుడు గణపతి 5వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణపతి 25 ఏళ్ల పాటు ఆదివాసీ హక్కుల కోసం పోరాటాలు చేశారన్నాడు. అతని స్ఫూర్తితో గిరిజన ప్రజల సమస్యలపై పోరాడతామన్నాడు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లంకా రాఘవులు, నాయకులు శకుంతల, జమున, భగవండ్లు, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

దుప్పిని హతమార్చిన ముగ్గురి రిమాండ్



నిందితులను చూపిస్తున్న అధికారులు

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్ ఫారెస్టు రేంజ్ పరిధిలోని వేంపల్లి ఫారెస్టు బీట్ పరిధిలో ఈనెల 13న దుప్పిని హతమార్చిన ముగ్గురికి రిమాండ్ విధించినట్లు ఎఫ్‌ఆర్‌వో రమాదేవి, డిప్యూటీ రేంజ్ అధికారి శశిధర్‌బాబు తెలిపారు. ఈ నెల 13న వేంపల్లి అటవీ ప్రాంతంలో కొందరు దుప్పిని హతమార్చినట్లు సమాచారం రావడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపించామన్నారు. నిందితులు సిర్పూర్ (టి) మండలంలోని మన్నెగూడ గ్రామానికి చెందిన నాయని అశోక్, రాలే అంజి, టేకం తిరుపతిని అరెస్టు చేసి సోమవారం సిర్పూర్ (టి) కోర్టులో హాజరుపర్చగా కోర్టు 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

వావివరసలు మరిచిన కామాంధుడు

- బాలికపై ఏడాదిగా అఘాయిత్యం
- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: అభం, శుభం తెలియని బాలికపై ఓ కామాంధుడు కొన్నినెలలుగా అత్యాచారానికి పాల్పడుతున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చుట్టపు రీతిన తరచూ ఇంటికి వస్తూ బాబాయి వరుస అయ్యే వ్యక్తి వావి వరసలు మరిచి ఆ బాలికపై కన్నేశాడు. మాయమాటలతో లోబర్చుకుని అఘాయిత్యానికి పాల్పడుతున్నాడు. విషయం తల్లిదండ్రులకు తెలియడంతో అతన్ని మందలించగా వారిపైనే తిరగబడి బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు ఆదివారం టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. తమ కూతురుకు న్యాయం చేయాలని వేడుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన వ్యక్తి (32) కొన్నేళ్లుగా ఆదిలాబాద్ పట్టణంలోని టూటౌన్ ఏరియాలో అద్దెకు ఉంటున్నాడు. బాధితురాలి తల్లి తమ్ముని బామ్మర్ది వరుసకు అమ్మాయికి బాబాయి కావడంతో తరచూ ఇంటికి వస్తూ పోతు ఉండేవాడు. దీంతో చనువు పెంచుకున్నాడు. ఇదే ఆసరాగా చేసుకుని కొన్ని నెలలుగా బాలికపై అత్యాచారానికి పాల్పడుతున్నాడు. ఆ బాలిక పదో తరగతి పూర్తి చేసి ఇంటి వద్ద ఉంటుంది. నిందితుడితో పాటు బాధితురాలి తల్లిదండ్రులు సైతం కూరగాయలు విక్రయిస్తు జీవనం సాగిస్తున్నారు. కామాంధుడికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. సభ్య సమాజం తలదించుకునే విధంగా వ్యవహరించడంతో అమ్మాయి విలువైన జీవతం నాశనమైంది. నిందితుడు పరారీలో ఉండగా పోలీసులు గాలిస్తున్నట్లుగా తెలిసింది. ఆ వ్యక్తిపై పోక్సో కింద కేసు నమోదు చేసినట్లుగా టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు.

పోడుభూముల్లో కందకాలు అడ్డగింత



సాగుదారులను పంపిస్తున్న అధికారులు

బేల: మండలంలోని బాది రెవెన్యూ గ్రామ శివారులో అటవీ ప్రాంతానికి అనుసంధానంగా ఏళ్లుగా సాగు చేస్తున్న 50 ఎకరాల పోడు భూముల్లో మొక్కలు పెంచడానికి అటవీ అధికారులు కందకాలు తవ్విస్తుండగా సోమవారం 12మంది రైతులు అడ్డుకున్నారు. 20 ఏళ్లకు పైబడి నుంచి సాగు చేస్తున్న ఈ భూముల్లో సాగు చేయనివ్వకుండా, భూములను అన్యాయంగా లాక్కోవాలని ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. ఈక్రమంలో అటవీ అధికారులు, రైతుల మధ్యన వాగ్వాదం నెలకొంది. ఈ భూములు పోతే ఉపాధి అవకాశాలు లేకుండా పోతాయని, ఈ భూములు లాక్కొంటే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని బాధిత రైతులు హెచ్చరించారు. దీంతో అటవీ అధికారులు చేసేదేంలేక ఆ రైతులతో కలిసి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

రిమాండ్ మహిళా ఖైదీ హైడ్రామా

ఆదిలాబాద్‌టౌన్: సుపారి ఇచ్చి ప్రభుత్వ ఉపాధ్యాయుడైన తన భర్త జాదవ్ గజానంద్‌ను భార్యనే హత్య చేయించిన సంఘటన ఇటీవల జిల్లాలో సంచలనం సృష్టించింది. ఈ కేసులో ప్రధాన నిందితురాలి గా ఉన్న మృతుని భార్య విజయలక్ష్మిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఆదిలాబాద్ పట్టణంలోని జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న విజయలక్ష్మి బ్లేడ్ ముక్కలు మింగినట్లుగా జైలు అధికారులతో ఆదివారం సాయంత్రం తెలిపింది. తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతున్నట్లుగా పేర్కొనడంతో జైలు అధికారులు రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు 24గంటల పాటు పర్యవేక్షణలో ఉంచారు. అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి ఎలాంటి బ్లేడు ముక్కలు లేవని నిర్ధారించారు. దీంతో జైలు సిబ్బంది ఆమెను తిరిగి జైలుకు తరలించారు. ఈ విషయమై జిల్లా జైలు సూపరింటెండెంట్ అశోక్‌ను సంప్రదించగా ఆమె పూర్తి ఆరోగ్యంగా ఉండడంతో తిరిగి జిల్లా జైలుకు తరలించినట్లు తెలిపారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య



నాందేవ్(ఫైల్)

ఇచ్చోడ: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల మేరకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బృందావన్‌కాలనీలో నివాసముంటున్న కుమ్ర నాందేవ్ (56) మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసై వింతగా ప్రవర్తిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం అతిగా మద్యం సేవించి పాఠశాల డైనింగ్ హాల్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య కుమ్ర చంద్రకళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బాసరలో 'మహా' రద్దీ



అమ్మవారిని దర్శించుకుంటున్న మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి



శాలువాతో సత్కరించి ఫ్లవర్ బొకే అందజేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్



మండపంలో అక్షరాభ్యాసం చేయించుకుంటున్న భక్తులు

బాసర: నిర్మల్ జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, చదువులతల్లి శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారు కొలువుదీరిన బాసర క్షేత్రానికి సోమవారం పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. వరుస సెలవులు రావడంతో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. సుమారు లక్ష మంది భక్తులు అమ్మవారి దర్శనానికి వచ్చారు. దీంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మహారాష్ట్రకు చెంది శ్రీస్వామి సమర్థగురు ఆధ్వర్యంలో బాసరలో రెండు రోజులపాటు అక్షరాభ్యాస పూజ నిర్వహిచారు. ఈ కార్యక్రమానికి 60 వేల మంది మహారాష్ట్రవాసులు తరలివచ్చారు. తమ చిన్నారులకు అక్షకాభ్యాసం చేయించారు. ఇక్కడికి వచ్చిన భక్తులంతా అమ్మవార దర్శనానికి క్యూ కట్టారు. అఖిల భారతీయ స్వామి సమర్థగురు పీఠం ఆధ్వర్యంలో కమిటీ నిర్వాహకులు భక్తులకు మంచినీరు, ప్రసాదం అందజేశారు. పరమ పూజ్య గురుమావులితో చిన్నారులకు అక్షరాభ్యాస, కుంకుమార్చన పూజలు, బీజాక్షరాలతో సరస్వతి అమ్మవారి నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. చివరి రోజు కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి. అశోక్‌చ చావాన్, ముధోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే రామారావు పటేల్ పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో రేవంత్‌రెడ్డి యువసైన్యం సభ్యులు..



తీర్థప్రసాదాలు అందించి శాలువాతో సత్కరించిన నాయకులు, వేద పండితులు

బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారిని సీఎం రేవంత్‌రెడ్డి యువ సైన్యం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహా, సింగర్ నర్సింహా సోమవారం దర్శించుకున్నారు. వీరికి స్థానిక సభ్యుడు ప్యాట్లు సుఖేశ్‌రావు స్వాగతం పలికారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహా, సింగర్ నర్సింహా, రేవంత్ సైన్యం సభ్యులు శ్రీకర్‌రెడ్డి, బత్తిన రాంకుమార్‌గౌడ్, భరత్ గౌడ్, సతీశ్ కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్ వారిని ఆశీర్వదించారు. వేములవాడ అతిథిగృహంలో సభ్యులను సుఖేష్ సన్మానించి అమ్మవారి చిత్రపటం అందజేశారు.

పట్టుకున్నారు..వదిలేశారు..!

బోథ్: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్న అధికారులు వదిలేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. మండలంలోని పొచ్చెర క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం మైనింగ్ అధికారులు లారీని పట్టుకున్నారు. ఈ క్రమంలో డ్రైవర్ పరారుకావడంతో లారీని అధికారులు స్వాధీనం చేసుకోకుండా అలాగే వదిలేసి వెళ్లిపోయారు. ఈ విషయమై మైనింగ్ టెక్నికల్ అసిస్టెంట్ పవార్ రమేశ్‌ను వివరణ కోరగా సంఘటనా స్థలంలో లారీ డ్రైవర్ లేకపోవడంతో వెనుదిరిగినట్లు తెలిపారు. మంగళవారం లారీకి సంబంధించి రవాణ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

బాలిక అదృశ్యం



అఖిల (ఫైల్)

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెంది న గండికోట అఖిల (17) అనే బాలిక ఆది వారం రాత్రి నుంచి కనిపించడం లేదు. కు టుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం బాలిక తల్లి గండికో ట ఎల్లవ్వ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

హరితహారం అభాసుపాలు





గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో నిర్మల్ జిల్లా కేంద్రంలో అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో అభాసుపాలవుతోంది. లక్షల రూపాయలు వెచ్చించి నాటిన మొక్కలను రక్షించడంతో మున్సిపల్ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఎండిపోతున్నాయి. ఖానాపూర్ వెళ్లే ప్రధాన రహదారికి ఎడమవైపు సెయింట్ థామస్ పాఠశాల ఎదుట విలువైన మున్సిపల్ స్థలంలో రెండేళ్ల క్రితం రావి, వేప తదితర మొక్కలు నాటారు. గతేదాది వరకు ఏపుగా పెరిగాయి. ఆరు నెలల క్రితం ప్రభుత్వం మారడంతో మొక్కలను పట్టించుకునేవారు కరువయ్యారు. దీంతో ట్రీగార్డులు కూడా మాయమయ్యాయి. ఇక మొక్కలకు నీరు పట్టకపోవడంతో ఎండిపోయాయి. కొందరు ఈ మొక్కలపై మట్టిపోసి స్థలం కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారు. అయినా మున్సిపల్ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్, నిర్మల్